సాక్షి ఖమ్మం

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



కలెక్టరేట్‌లో బతుకమ్మ

సంక్షేమ శాఖల ఆధ్వర్యాన బతుకమ్మ వేడుకలు నిర్వహించగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు శ్రీజ, ఉద్యోగులు పాల్గొన్నారు. 8లో



... కాపాడుకుందాం

ప్రకృతితో పాటు మహిళలను కాపాడుకోవాలనే నినాదంతో బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు ప్రజాగాయని విమలక్క వెల్లడించారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి చేరతాయి.

న్యూస్‌రీల్

శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



తీర్థపు బిందెతో వస్తున్న అర్చకులు, ఈఓ

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి నుండి సాయంత్రం తీర్థపు బిందెతో అర్చకులు, ఉద్యోగులు మేళతాళాల నడుమ శ్రీవారు, అమ్మవార్లు కొలువైన యాగశాలలోకి ప్రవేశించారు. అనంతరం ఉత్సవాలను ప్రారంభించి కలశ స్థాపన, గణపతి పూజ నిర్వహించాక శ్రీఅలివేలు మంగ అమ్మ వారిని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అవతారంలో అలంకరించారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరిండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100కు 5,511 ఫోన్లు

ఖమ్మంక్రైం: చోరీలు, ప్రమాదాలతో పాటు ఇతర నేరాల సమాచారం తెలియచేసేందుకు ఏర్పాటుచేసిన డయల్ 100కు సెప్టెంబర్‌లో 5,511 మంది ఫోన్ చేశారని సీపీ సునీల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 81 ఫోన్లకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయగా, మహిళలపై వేధింపులు, దొంగతనాలు, రోడ్డుప్రమాదాలు, అనుమానాస్పద మరణాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని వెల్లడించారు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రం డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సాయం పొందాలని ఆయన సూచించారు.

'ఓపెన్' పరీక్షలకు 79మంది హాజరు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరిధిలో పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పదో తరగతిలో 58మందికి గాను 44మంది, ఇంటర్ పరీక్షకు 47మందికి గాను 35మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఐఈఓ రవిబాబు, పరీక్షల విభాగం అధికారి ధనా, పాపారావు తదితరులు సందర్శించారని వెల్లడించారు.

సకాలంలో విధులకు హాజరుకావాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరవుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. రెవెన్యూ విభాగాల పనితీరుపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విభాగాల వారీగా పెండింగ్ ఫైళ్ల వివరాలు ఆరా తీసి పరిష్కారానికి సూచనలు చేశారు. ఉద్యోగులు ఉదయం 10–30 గంటలకల్లా బయోమెట్రిక్ విధానంలో లాగిన్ కావాలని, సాయంత్రం విధులు ముగిశాక తప్పనిసరి లాగ్ ఔట్ తప్పనిసరిగా కావాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకున్న వందనం కార్యదర్శి



సహచర కార్యదర్శులు, కార్మికులతో శ్రీనివాసరావు

చింతకాని: స్వచ్ఛభారత్ మిషన్ దివస్‌లో భాగంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చింతకాని మండలం వందనం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆయన కల్లూరు మండలం కొర్లగూడెంలో విధులు నిర్వర్తించిన సమయాన పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వర్తించి గ్రామాన్ని ఓడీఎఫ్ ఫ్రీగా మార్చారు. ఈ మేరకు రాష్ట్రం నుంచి ఇద్దరు కార్యదర్శులను ఎంపిక చేయగా శ్రీనివాసరావు కూడా ఉండడంతో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆయనను ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ పర్వీన్ ఖైజర్, ఉద్యోగులు అభినందించారు.

కార్పొరేషన్, మున్సిపాలిటీలు, సుడా, జీపీల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు	ఖమ్మం కార్పొరేషన్	మధిర	సత్తుపల్లి	వైరా	సుడా	మొత్తం
	39,945	4,276	3,688	3,516	26,745	98,270

మూడు దశల్లో వడబోత



కేఎంసీ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న దరఖాస్తుదారులు

ఊపందుకున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

- కీలకంగా మారనున్న ఇరిగేషన్ ఎన్‌ఓసీ
- పరిశీలన అనంతరం నగదు చెల్లించాలని సమాచారం
- 98,270 దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిశీలన శరవేగంగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత శాఖల అధికారులు మూడు దశల్లో దరఖాస్తుల స్క్రీనింగ్ చేపట్టారు. మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ శాఖల ఆధ్వర్యాన పరిశీలిస్తుండగా ఇందులో నీటిపారుదల శాఖ ఎన్‌ఓసీ కీలకంగా మారింది. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 98,270 దరఖాస్తులు రాగా 8,200 పరిశీలనలో ఉన్నాయి. వీటిలో 669 దరఖాస్తులకు అనుమతులు జారీ చేయడంతో ప్రభుత్వానికి రూ.3.73 కోట్లు ఆదాయం సమకూరింది. మిగతా దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండడంతో చకచకా సాగుతోంది.

అన్నీ సక్రమంగా ఉంటేనే..

2018–19 ఏడాదిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం అందిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దరఖాస్తులన్నింటినీ మూడు దశల్లో పరిశీలిస్తున్నారు. తొలి దశ(ఎల్–1)గా పట్టణ ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఆఫీసర్లు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారులు జత చేసిన పత్రాలను పరిశీలిస్తారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనుమతులను, రెవెన్యూ అధికారులు స్థలాన్ని, నీటిపారుదల శాఖ అధికారులు శిఖం భూమిలో ఉందా అని పరిశీలన చేపడతారు. ఆతర్వాత ఎల్–2కు దరఖాస్తు చేరుతుండగా టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ తొలిదశలో అధికారుల పరిశీలనపై ఆరా తీశాక దరఖాస్తులకు జత చేసిన పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయా, లేదా అని చూస్తారు. ఉదాహరణకు ఇల్లు నిర్మించుకుంటే పట్టా జత చేశారా అని పరిశీలించి ఎల్–3కి పంపిస్తారు. అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులు, సంబంధించి పత్రాలన్నీ పరిశీలించి అంతా సక్రమంగానే ఉందని నిర్ధారించుకున్నాక చలానా కట్టాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తారు. దీంతో వారు చలానా కడితే స్థలం క్రమబద్ధీకరిస్తారు.

కొందరి అలసత్వం...

జిల్లాలో 1,500 దరఖాస్తులకు సంబంధించి చలానా కట్టాలని నోటీసులు జారీ చేసినా యజమానుల్లో కొందరు ముందుకు రావడం లేదని తెలిసింది. ఖాళీ జాగా అమ్మేసిన పలువురు భవనం నిర్మించుకునే వారే చలానా కడతారనే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకుంటేనే భవన నిర్మాణానికి అనుమతి వస్తుందని, లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు ప్రచారం చేస్తున్నారు. అంతేకాక ప్లాట్లు కొనుగోలు చేసే వారు అనుమతులు, సరైన పత్రాలు ఉన్నాయో, లేదో సరిచూసుకోవాలని.. అంతా సవ్యంగా ఉన్న లే ఔట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేసేలా ప్రచారానికి నిర్ణయించారు.

ఎల్‌ఆర్‌ఎస్ మంచి అవకాశం..



అనుమతి లేని లే ఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అవకాశం కల్పించింది. కష్టపడి సంపాదించిన సొమ్ముతో స్థలాలు కొన్నవారు ఇబ్బంది పడొద్దని క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చారు. దీన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఒక లే ఔట్‌లో 100 ఇళ్లు ఉంటే.. వ్యక్తిగతంగా ఎవరికి వారు రెగ్యులరైజ్ చేసుకోవచ్చు. అయితే, గతంలో అందిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తున్నాం.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

మూడు శాఖల ఉద్యోగులు కలిసి..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ శాఖలు కీలకంగా మారాయి. గతంలో మూడు శాఖలకు సంబంధించిన అధికారులు ఒక్కొక్కరు ఒక్కోసారి పరిశీలనకు వెళ్లే వారు. కానీ ఇప్పుడు ముగ్గురూ ఒకేసారి పరిశీలనకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, జిల్లాలో ఇరిగేషన్ ఏఈలు తక్కువగా ఉండడంతో శాఖ నుంచి శిఖంలో భూమిలో స్థలం లేదంటూ ఎన్‌ఓసీల జారీలో ఆలస్యం జరగగా దరఖాస్తుల పరిశీలన నెమ్మదిగా కొనసాగింది. అంతేకాక అర్బన్ ప్రాంతాల్లో నీటిపారుదల శాఖకు సంబంధించిన భూములు ఎక్కువగా ఉండటంతో కొంత జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యాన అదనపు సిబ్బందిని సమకూర్చుకుని రోజుకు 400 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్యంగా నిర్దేశించడంతో బృందాలు పనిలో వేగం పెంచాయి.

ప్రతీ కుటుంబం వివరాలు తప్పనిసరి

- ఎలాంటి లోపాలు లేకుండా ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన కేఎంసీ కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: కుటుంబాల వారీగా వివరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై డిజిటల్ కార్డులు జారీ చేయనుండగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కేఎంసీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు నియోజకవర్గాల నుంచి రెండేసి ప్రాంతాల చొప్పున పది ప్రాంతాల్లో సర్వే మొదలైందని తెలిపారు. ఇందులో ఒక్కో పట్టణ, గ్రామీణ ప్రాంతం ఉండగా పాలేరు నియోజకవర్గంలో మాత్రం రెండు గ్రామీణ ప్రాంతాలు ఎంపిక చేశామని చెప్పారు. సిబ్బంది ఆయా ప్రాంతాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబాల వివరాలు సేకరించి ఫొటోలు తీశాక అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా ప్రత్యేక గుర్తింపు నంబర్‌తో డిజిటల్ కార్డు అందుతుందని చెప్పారు. అయితే, రేషన్ కార్డుల జారీకి ఈ సర్వేతో సంబంధం లేదనే అంశంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు సీహెచ్.స్వామి, లూథర్ విల్సన్, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాల సేకరణ

జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్



ధర్మాతండాలో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

కూసుమంచి: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాల సేకరణ, నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉద్యోగులు జాగ్రత్త వహించాలని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ సూచించారు. కూసుమంచి మండలం ధర్మాతండాలో సర్వేను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. కాగా, ఆధార్ నంబర్లు గ్రామపంచాయతీ రికార్డుల్లో ఒక రకంగా, కార్డుల్లో మరో రకంగా ఉన్నాయని ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకురాగా పంచాయతీ రికార్డులనే పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో డిజిటల్ కార్డుల విధానం అమల్లో ఉండగా వీటితో అనేక లాభాలు ఉంటాయని చెప్పారు. మూడు రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని, ఏరోజుకా రోజు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డీఆర్వో రాజేశ్వరి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, డీటీ కరుణ, ఎంపీఓ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో నేత్రపర్వంగా నిత్యకల్యాణం

భద్రాచలం : రామాలయంలో గురువారం స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

'ఆర్‌సీఎస్'కు అడుగులు

త్వరలో రీజినల్ కేన్సర్ సెంటర్ ఏర్పాటు

- కేన్సర్ వైద్యసేవల విస్తరణపై సర్కారు నజర్
- ప్రాథమిక దశలోనే నిర్ధారణ, చికిత్స
- ఉమ్మడి జిల్లాకు సంబంధించి కొత్తగూడెంలో ఏర్పాటుకు మొగ్గు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యాన త్వరలోనే అత్యాధునిక కేన్సర్ చికిత్స అందుబాటులోకి రానుంది. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా కొత్తగూడెంలో రీజినల్ కేన్సర్ సెంటర్(ఆర్‌సీఎస్) ఏర్పాటుకు చకచకా అడుగులు పడుతున్నాయి.

విస్తృత సేవలకు కసరత్తు..

దేశవ్యాప్తంగా మధుమేహం, కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. ఇప్పటికే మధుమేహానికి చికిత్సలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతం చేశాయి. ఇప్పుడు కేన్సర్ వ్యాధిగ్రస్తులను ఆదిలోనే గుర్తించి సరైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో ఉన్న చికిత్స కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దీంతో పాటు పాత జిల్లాల వారీగా రీజినల్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. తొలి దశలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి కొత్తగూడెంను ఎంపిక చేశారు.

నాలుగు రాష్ట్రాల ప్రజలకు..

ప్రస్తుతం రాష్ట్రంలోని హైదరాబాద్ ఎస్ఎంజీ కేన్సర్ సెంటర్లోనే పూర్తిస్థాయిలో వైద్యం అందుతోంది. ఈ ఆస్పత్రికి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి బాధితులు వస్తున్నారు. అయితే, కేన్సర్ చికిత్స సుదీర్ఘ కాలం కొనసాగించాల్సి ఉంటుంది. దీంతో రోజులు, నెలల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. పైగా చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు అందరూ హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తగా రీజినల్ కేన్సర్ సెంటర్లు అందుబాటులోకి వస్తే మొదటల్లోనే వ్యాధిని గుర్తించడంతో పాటు ప్రాథమిక చికిత్స ఇక్కడే అందించే అవకాశం ఉంటుంది. ఇక కొత్తగూడెంలో రీజినల్ సెంటర్ ఏర్పాటుచేస్తే గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గిరిజనానికి వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. అలాగే, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలోని ఏజెన్సీ ప్రజలకు అందుబాటులో ఉంటుందనే భావనతో కొత్తగూడెంనుఎంచుకున్నట్లు తెలుస్తోంది.

హృద్రోగ సేవలు కూడా వస్తే..

కొత్తగూడెం ఏరియా ఆస్పత్రి ప్రస్తుతం బోధనాస్పత్రిగా మారింది. దీంతో ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల ట్రామా కేర్ సెంటర్ కూడా మంజూరైంది. ఇప్పుడు రీజినల్ కేన్సర్ సెంటర్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇదే ఒరవడిలో సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వ రంగంలో గుండె సంబంధిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే ఏజెన్సీ ప్రాంతంలో ఇటు ప్రైవేట్, అటు ప్రభుత్వ రంగంలో కనీస స్థాయిలో కూడా గుండె సంబంధిత వైద్య సేవలు అందుబాటులో లేవు. ఎవరికైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్డియాలజీ విభాగంలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తేవాలని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

రూ.50 కోట్ల వ్యయంతో..

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. కొత్తగూడెంలో ఉన్న బోధనాస్పత్రిలో ఈ కేన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ వ్యాధి లక్షణాలను గుర్తించడంతో పాటు చికిత్స చేస్తారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తారు. ఇప్పటికే ఉన్న రేడియాలజీ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తారు. దీంతో పాటు హైదరాబాద్‌లో ఉన్న ఎస్ఎంజీ కేన్సర్ ఆస్పత్రి వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ చికిత్స కొనసాగించేలా టెలీ/వీడియో మెడిసిన్ విధానాలు అందుబాటులోకి తెస్తారు. ఇందుకోసం ఒక్కో రీజినల్ కేన్సర్ సెంటర్ నిర్మాణానికి రూ.50 కోట్లు వ్యయం చేయనున్నారు.

గణనతో సంపద తేల్చండి..

రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు గౌరీశంకర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గౌరీశంకర్, వివిధ సంఘాల నాయకులు

ఖమ్మంఅర్బన్: కులగణనతో పాటు ఆర్థిక సర్వే నిర్వహిస్తే రాష్ట్రంలో 90శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వద్ద ఉన్న సంపద ఎంత... పది శాతం జనాభా కలిగిన ఆధిపత్య కులాల సంపద ఎంతో తేలిపోతుందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ వెల్లడించారు. ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ రచించిన 'కులగణన – రిజర్వేషన్లు – శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని ఖమ్మంలోని గోకుల కృష్ణసేవా సమితి ట్రస్ట్ భవన్‌లో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కులగణన, సమగ్ర సర్వే చేపడితేనే బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో న్యాయం జరుగుతుందని చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలయేల్యా బీసీలంతా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. బీసీలు ప్రాధేయపడే స్థాయి నుంచి పోరాడే స్థాయికి ఎదిగితే హక్కులు సాధించుకోవచ్చని, బీసీలు ఓట్లేసే యంత్రాలు కాదు.. అధికార రాజముద్రలని తెలియజేసే రోజులు సమీపంలోనే ఉన్నాయని గౌరీశంకర్ తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడగా వివిధ సంఘాల నాయకులు సుంకర శ్రీనివాసరావు, బిచ్చాల తిరుమలరావు, బారి మల్సూర్, కత్తి నెహ్రూగౌడ్, అమరగాని వెంకన్నగౌడ్, యర్రబోయిన గోవిందరావు, గుమ్మడి రోశయ్య, సింగాల బిక్షం, నాగరాజు, గంగరాజు, పోతగాని కృష్ణారావు, బండి నాగేశ్వరరావు, . దానయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలకు త్వరలోనే పరిష్కారం

మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులకు సంబంధించి సమస్యలకే కాక పెండింగ్ బిల్లులకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తెలిపారు. ఖమ్మంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 20వేల మందికిపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించిన ఘనత తమ సంఘానికి దక్కుతుందని తెలిపారు. కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు, 010 ద్వారా వేతనాలు, మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్‌కేర్ లీవ్ తదితర సౌకర్యాలు కల్పించగలిగామని చెప్పారు. అలాగే, కేజీబీవీలు, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రవీందర్ వెల్లడించారు.

జిల్లా అధ్యక్షుడిగా 'యలమద్ది'



వెంకటేశ్వర్లు, రంగారావు

పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీని ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు వ్యవహరించగా నూతన కమిటీని పలువురు అభినందించారు. ఈసమావేశంలో నాయకులు శేఖర్, రమణ, చిత్తలూరి ప్రసాదరావు, నంబూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ఏఈఓల ససేమిరా..

- సహాయకులను ఇవ్వాల్సిందేనని డిమాండ్
- ఇప్పటికీ జిల్లాలో మొదలుకాని పంటల డిజిటల్ సర్వే
- విధులకు హాజరవుతున్నా గైర్హాజరు వేస్తున్నారని ఆగ్రహం



పెనుబల్లిలో నిరసన తెలుపుతున్న ఏఈఓలు (ఫైల్)

నేలకొండపల్లి: రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ సర్వే జిల్లాలో మొదలుకాలేదు. సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓ)కు అప్పగించింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపొందించి ఏఈఓలకు శిక్షణ కూడా ఇచ్చారు. అయితే, ఇప్పటికే సర్వే మొదలుకావాల్సి ఉన్నప్పటికీ అదనపు భారం మోయలేమని తేల్చిచెప్పిన ఏఈఓలు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. అయితే, నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్నా తమకు వ్యవసాయాధికారులు గైర్హాజరు నమోదు చేస్తున్నారని మండిపడుతున్నారు. సర్వే చేయడం లేదనే భావనతో ఇలా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఇప్పటికే పనిభారం

జిల్లాలోని 129 రైతు క్లస్టర్ల పరిధిలో ఒక్కో ఏఈఓకు 6వేల నుంచి 10 వేల ఎకరాల భూములను కేటాయించారు. ఒక్కో ఏఈఓ తన పరిధి వ్యవసాయ భూముల్లో సర్వే నంబర్ల వారీగా సాగు చేసిన పంటల వివరాలు, ఫొటోలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, నిర్దేశిత వ్యవధిలో సర్వే చేయడం కష్టమని వారు చెబుతున్నారు. ఇప్పటికే పని భారంతో సతమతవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.


జిల్లాలో వ్యవసాయ శాఖ వివరాలు

వ్యవసాయ శాఖ డివిజన్లు	05
క్లస్టర్లు	129
ఏఈఓలు	119
ఔట్‌సోర్సింగ్	10
సాగు విస్తీర్ణం	5.79 లక్షల ఎకరాలు

తగ్గేదే లేదు..

ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సర్వే మొదలుకావాల్సి ఉంది. కానీ పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమని ఏఈఓలు తెగేసి చెప్పారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెప్పేశారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే డిజిటల్ సర్వే నిర్వహించడం అసాధ్యమని చెబుతున్న వారు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. అయినప్పటికీ అటు ప్రభుత్వం, ఇటు అధికారుల నుంచి స్పందన రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

మరింత భారం అవుతుంది..



వ్యవసాయ శాఖకు సంబంధించిన పనులు ఇప్పటికే భారంగా మారాయి. మళ్లీ డిజిటల్ సర్వే మొదలుపెడితే మరింత భారం అవుతుంది. అయినా మేం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ ప్రతీ ఏఈఓకు సహాయకులను నియమించాలని కోరుతున్నాం. ఇతర రాష్ట్రాల మాదిరిగా సర్వే చేయించినా ఫర్వాలేదు. మా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సర్వే చేసేది లేదు.

– షేక్ నాగుల్‌మీరా, ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ప్రభుత్వ సంకల్పంతోనే నిరుద్యోగుల కల సాకారం



అభ్యర్థిని సన్మానిస్తున్న సైదులు, పక్కన డీఈఓ శర్మ తదితరులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వ సంకల్పంతోనే నిరుద్యోగుల కల సాకారమవుతోందని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీజీఈజే ఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఖమ్మం రోటరీనగర్ పాఠశాలలో పరిశీలిస్తుండగా ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని డీఈఓ సోమశేఖర శర్మ సమక్షాన సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా ఉపాధ్యాయుల నియామకం చేపట్టడం ద్వారా నిరుద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయని తెలిపారు. ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి, మన్సూర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, నాయకులు పాశం శ్రీనివాసరావు, కరీముల్లా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం బతుకమ్మ సంబురాల్లో వివాదం

జీపీలో ఆడొద్దని పోలీసులు అడ్డుకోవడంతో రాస్తారోకో



ఎస్‌ఐతో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ, మహిళలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బతుకమ్మ ఆడు కోవద్దని మహిళలను పోలీసులు అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. తొలిరోజైన బుధవారం ఇక్కడే బతుకమ్మ ఆడిన మహిళలు గురువారం సాయంత్రం చేరుకున్నారు. ఇంతలోనే పోలీసులు వచ్చి బతుకమ్మ ఆడకుండా అడ్డుకోవడంతో మాజీ జెడ్పీటీసీ శీలం కవితతో పాటు పలువురు మహిళలు రాస్తారోకో చేశారు. దీంతో ఎస్‌ఐ పి.వెంకటేష్ నచ్చచెప్పగా కవిత ఇంటి ఎదుట రోడ్డుపై బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలు జరుపుకోవడానికి కలెక్టర్ అనుమతి తీసుకున్నప్పటికీ కొందరు కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే పోలీసులు, అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కాగా, ఈ ఘటనతో గ్రామంలో వివాదాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు



సీహెచ్‌సీ సమీపాన డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

తిరుమలాయపాలెం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత హెచ్చరించారు. తిరుమలాయపాలెం గ్రామపంచాయతీని గురువారం తనిఖీ చేసిన ఆమె రికార్డులను పరిశీలించాక పారిశుద్ధ్య పనులు, సమీపాన సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా పారిశుద్ధ్య పనుల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిరక్షించాలని సూచించారు. ఎంపీఓ పి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

8న పాత పార్సిళ్ల వేలం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో పాయింట్‌లో ఎవరూ తీసుకెళ్లకుండా మిగిలిన పాత పార్సిళ్లను ఈనెల 8న వేలం వేయనున్నట్లు ఏటీఎం పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బస్టాండ్ ఆవరణలో 8న సాయంత్రం 4 గంటలకు జరిగే వేలంలో ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. లాజిస్టిక్ ఆఫీస్ పరిధిలో పెండింగ్ పార్సిళ్ల క్లియరెన్స్ కోసం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,100	5,400
మిర్చి	18,100	9,000
మిర్చి తాలు	10,000	5,000
ఏసీ మిర్చి	20,000	10,000
ఏసీ తాలు	10,000	9,000
కొత్త పత్తి	7,011	5,000
పాత పత్తి	7,600	6,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043

కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌తో కలెక్టర్, అధికారులు



మహిళలతో బతుకమ్మ ఆడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొని బతుకమ్మల వద్ద పూజలు చేశారు. అలాగే, అదనపు కలెక్టర్ శ్రీజ ఉద్యోగినులు, మహిళలతో ఆడిపాడారు. బాలికలను సంరక్షించాలనే నినాదంతో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098ను ప్రదర్శించారు.

– ఖమ్మం సహకారనగర్

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- సన్న, దొడ్డు రకాల ధాన్యానికి వేర్వేరు కేంద్రాలు
- వీసీలో సూచనలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లాలో 236 ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించిన కలెక్టర్



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి తదితరులతో కలిసి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించిన సీఎం, కేంద్రాల్లో ఏర్పాట్లు, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనపై సూచనలు చేశారు. ఆతర్వాత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించగా సన్న రకం ధాన్యంపై ఏఈఓ ద్వారా ధ్రువీకరించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పర్యవేక్షించాలని, రైతులు తమ చెప్పుకునేలా 1077 టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎస్‌ఓ చందన్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం శ్రీలత, డీఏఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

జిల్లాలోని గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. గురుకులాలు, హాస్టళ్ల నిర్వహణపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన సంక్షేమ శాఖలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ వారం అధికారులు కనీసం మూడు హాస్టళ్లను తనిఖీ చేయాలని, భోజన సామగ్రి సరఫరా చేసే టెండర్ల ఖరారు సమయంలో అన్ని వివరాలు పరిశీలించాలని తెలిపారు. ప్రతీ హాస్టల్‌లో విద్యార్థులతో ఫుడ్ కమిటీలు ఏర్పాటుచేస్తే ఫలితం ఉంటుందన్నారు. దసరా సెలవుల్లో వంట సిబ్బంది, వార్డెన్లకు శిక్షణ ఇప్పించాలని తెలిపారు. సంక్షేమ శాఖల అధికారులు జి.జ్యోతి, కె.సత్యనారాయణ, విజయలక్ష్మి, ఆర్‌సీఓలు వెంకటరామయ్య, నాగేశ్వరరావు, ఈఈలు పి.విన్సెంట్ రావు, ఎస్.ఎస్.రామకోటి తదితరులు పాల్గొన్నారు. కాగా, గర్భిణులకు వైద్యసేవలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీజ సమావేశమై సూచనలు చేశారు. డీఎంహెచ్‌ఓ సుబ్బారావు, డీపీఓ ఆశాలత తదిరులు పాల్గొన్నారు.

పరిశీలనకు కౌంటర్లు పెంచండి..

డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించేందుకు ఖమ్మం రోటరీనగర్ హైస్కూల్‌లో కౌంటర్లు మరిన్ని ఏర్పాచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కేంద్రాన్ని గురువారం పరిశీలించిన ఆయన రెండు రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లుచేయాలని తెలిపారు. కాగా, గురువారం 490 మంది సర్టిఫికెట్లు పరిశీలించామని, ఇందులో 206 మంది ఎస్జీటీ అభ్యర్థులు, 233 మంది ఎస్‌ఏలు, 27 మంది లాంగ్వేజ్ పండిట్లు, 24 మంది పీఈటీలు ఉన్నారని చెప్పారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు సంబంధించి కోర్టు కేసు ఉండడంతో 37మంది సర్టిఫికెట్లు పరిశీలించడం లేదని తెలిపారు.

నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పోలీస్ డ్యూటీ మీట్‌ను పరిశీలిస్తున్న వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : నైపుణ్యం ఉంటే ఉద్యోగులు విధుల్లో మరింతగా రాణించొచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు హనుమకొండలో గురువారం నిర్వహించగా వరంగల్, ఖమ్మం పోలీసు కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ పోటీలను సీపీ ప్రారంభించి మాట్లాడుతూ కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాణించిన వారిని విభాగానికి ఇద్దరి చొప్పున హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోలీస్ ఉద్యోగులు వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా కేసుల పరిష్కారంలో వేగం పెరుగుతుందని తెలిపారు. అదనపు డీసీపీ రవితో పాటు జోన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడత కౌన్సెలింగ్



విద్యార్థికి అడ్మిషన్ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండో బ్యాచ్ ప్రవేశాలకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. మొత్తం వంద సీట్లకు గాను 15సీట్లు జాతీయ కోటాకు, 85 సీట్లు రాష్ట్ర కోటాకు కేటాయించారు. రాష్ట్ర కోటాలో తొలి విడతగా 65సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా ఈనెల 1నుండి 3వ తేదీ వరకు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అలాగే, జాతీయ కోటా 15 సీట్లలో 12 భర్తీ అయ్యాయి. జాతీయ, రాష్ట్ర కోటాలో మిగతా సీట్ల భర్తీకి అనుమతి రాగానే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. కాగా, ఈనెల 14వ తేదీ నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

డీఎస్సీ–2008 ఏజెన్సీ అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: డీఎస్సీ – 2008లో ఎంపికైన ఏజెన్సీ ప్రాంత బీఈడీ అభ్యర్థుల ధ్రువపత్రాలను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఖమ్మంలోని గిరిజన భవనంలో జరిగే పరిశీలనకు హాజరుకావాలని 67 మంది అభ్యర్థులకు సమాచారం ఇవ్వగా 47 మంది హాజరయ్యారు. ఈమేరకు అధికారులు జిరాక్స్ సెట్‌తో పాటు దరఖాస్తు సేకరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిన ఉపాధ్యాయులుగా నియమిస్తామని అధికారులు తెలిపారు. ఏటీడీఓ జహీరుద్దీన్, గిరిజన సంక్షేమశాఖ, డీఈఓ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీబీసీఐడీ విచారణ జరిపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వడంలో పాల్పడిన అక్రమాలపై సీబీసీఐడీ విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లాలో సీఎంఆర్ రైస్ విషయమై అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రూ.400 కోట్ల ప్రజాధనాన్ని మింగేశారని ఆరోపించారు. ఈ విషయం బయటపడినా ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభించడం సరికాదని తెలిపారు. దశాబ్దకాలంగా సాగుతున్న ఈ కుంభకోణంపై సీబీసీఐడీ జరిపించకపోతే సీపీఐ ఆధ్వర్యాన ఆందోళన చేపడతామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

క్లినికల్ తరగతులు ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులకు రెండో సంవత్సరం బోధనలో భాగంగా గురువారం క్లినికల్ క్లాసులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది తరగతి గదుల్లోనే బోధన సాగగా ఈ ఏడాది ఖమ్మం ప్రభు త్వ జనరల్ ఆసుపత్రిలో క్లినికల్ పాఠాలు బోధించనున్నారు. విద్యార్థులకు 36వారాల పాటు రొటేషన్ విధానంలో జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, డెంటల్, గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థో, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల్లో బోధనఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరీక్షించడం, నివేదిక పరిశీలన, మందులు రాయడంపై అవగాహన కల్పిస్తారు.

గంజాయి కేసుపై నార్కోటిక్స్ సీఐ ఆరా



రఘునాథపాలెం సీఐతో చర్చిస్తున్న రాము

రఘునాథపాలెం: రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌ను జోనల్‌స్థాయి నార్కోటిక్స్ సీఐ బి.రాము గురువారం సందర్శించి స్థానిక సీఐ ఉస్మాన్ షరీఫ్‌తో సమావేశమయ్యారు. ఇటీవల రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సంబంధిత కేసు నమోదు కాగా ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై ఆరా తీసిన నార్కోటిక్స్ సీఐ రాము మాట్లాడుతూ సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

తెగిపడిన విద్యుత్ లైన్

నేలకొండపల్లి: ఇళ్ల పైనుంచి వెళ్లిన విద్యుత్ లైన్‌తో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్న ప్రజలు తొలగించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులను కోరారు. అయినా పట్టించుకోకపోవడంతో అంతా అనుకున్నట్లుగానే వైర్ తెగిపడగా తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు... నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురంలో ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్ లైన్ కారణంగా ప్రమాదం జరగకముందే తొలగించాలని స్థానికులు పలుమార్లు కోరారు. అయినా పట్టించుకోలేదు. ఇంతలోనే గురువారం విద్యుత్ తీగలు తెగి ఓ ఇంటి మీదుగా రోడ్డుపై అడ్డంగా పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో అప్పటివరకు సమీపాన చెట్టు కింద కూర్చున్న మహిళలు పరుగులు తీయగా రోడ్డుపై వాహనదారులెవరూ లేకపోవడంతో రెప్పపాటులో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ విషయం తెలిసిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేరుకుని లైన్ సరిచేసేందుకు ప్రయత్నించగా ప్రజలు అడ్డుకున్నారు. అయితే, లైన్ సరిచేయకపోతే అమ్మగూడెం, రాజేశ్వరపురంతో పాటు పలు గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పడంతో శాంతించారు. కాగా, గాలిదుమారం కారణంగా తీగలు తెగి ఉంటాయని.. లైన్ మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని రాజేశ్వరపురం ఏఈ నారాయణరావు తెలిపారు.

పరుపుల వ్యాపారికి బురిడీ

రూ.71 వేలు కాజేసిన సైబర్ నేరగాడు

టేకులపల్లి: సైబర్ నేరగాడు పన్నిన వలలో పడి ఓ వ్యాపారి రూ.71 వేలు పోగొట్టుకున్న సంఘటనపై గురువారం కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ సురేష్ పరుపుల షాపు నిర్వహిస్తున్నాడు. రెండు వారాల క్రితం పరుపులు కావాలని గుర్తు తెలియని వ్యక్తి నుంచి సురేష్‌కు ఫోన్ వచ్చింది. దీంతో ముందస్తు పేమెంట్ చేస్తే పరుపులు డెలివరీ చేస్తానని వ్యాపారి చెప్పాడు. కొంత సేపటికి సైబర్ మోసగాడు మళ్లీ ఫోన్ చేసి ఫోన్ పే నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ కావడం లేదని, తొలుత మీరు నగదు పంపించండంటూ సూచించాడు. మొత్తం నగదు పరుపులు డెలివరీ అయినప్పుడు ఇస్తానని మోసగాడు నమ్మబలికాడు. దీంతో నమ్మిన వ్యాపారి తొలుత రూ.10 వేలు, మొత్తం 12 దఫాల్లో రూ.71 వేలు మోసగాడి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ చేస్తే మోసగాడు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో ట్రేస్ చేసి మోసగాడి ఖాతాను, అందులో ఉన్న రూ.23 వేలను ఫ్రీజ్ చేయించారు. సైబర్ విభాగం నుంచి గురువారం టేకులపల్లి పోలీసుస్టేషన్‌కు కేసు బదిలీ కాగా, ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఇద్దరు గుర్తుతెలియని యాచకులు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సమీపాన బస్టాప్‌లో గుర్తుతెలియని యాచకుడు(70) అనారోగ్యంతో మృతి చెంది ఉండగా టూటౌన్ పోలీసులు గుర్తించారు. అలాగే, పాత బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ సమీపంలో మరో యాచకుడు (65) మృతి చెందగా పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తన బృందంతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామన్నపేటకు చెందిన వివాహిత షేక్ రుక్ర(30) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త అప్పులు చేయడమే కాక ఇంటిని పట్టించుకోకపోవడం, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురైన రుక్ర ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై ఆమె సోదరి షేక్ సర్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హలీమ్ హుస్సేన్ తెలిపారు.



మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో విమలక్క, (ఇన్‌సెట్) బతుకమ్మతో విమలక్క

ప్రకృతి, మహిళలను కాపాడుకుందాం..

'బహుజన బతుకమ్మ'లో ప్రజాగాయని విమలక్క

ఖమ్మంఅర్బన్: ప్రకృతి, మహిళలను కాపాడుకుందామనే నినాదంతో ఈ ఏడాది బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు ప్రజా గాయని విమలక్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఖానాపురంలో గురువారం రాత్రి జరిగిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. బతుకమ్మలతో పెద్దసంఖ్యలో హాజరైన మహిళలతో కలిసి ఆడిపాడిన ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో చెరువులను కాపాడేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని చెబుతున్న ప్రభుత్వం.. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, అడవులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. అలాగే, హైదరాబాద్‌కు ఆక్సిజన్ అందిస్తున్న దామగుండం అడవిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్పర్శ సామాజిక అధ్యయన వేదిక భాస్కర్, పోడకంటి రాంబాబు, లక్ష్మణ్, మేకల సుగుణాకర్, దేవిరెడ్డి విజయ్, బాలబోయిన సందీప్‌తో పాటు పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అమెరికాలో ఖమ్మం ఆడబిడ్డల బతుకమ్మ



ఫ్లోరిడాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఖండాంతరాల్లోనూ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఖమ్మంకు చెందిన పలువురు అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో నివసిస్తున్నారు. ఆయా కుటుంబాల్లోని ఆడబిడ్డలు ఎంగిలిపూల బతుకమ్మ వేడుక జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి పూజలు చేసి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో సోము కవిత, కర్ణ పల్లవి, సారెడ్డి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక





పోటీలకు ఎంపికైన మేడేపల్లి విద్యార్థినులతో ఉపాధ్యాయులు, కుంచపర్తి విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ముదిగొండ/వేంసూరు: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీల్లో ముదిగొండ మండలం మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఫుట్‌బాల్ సీనియర్స్ జట్టు విజయంలో యువవర్షిణి, పావని, యశ్వంతి, మహేశ్వరి, మేధ కీలకంగా వ్యవహరించారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేసిన జిల్లా జట్టులో వీరికి స్థానం లభించిందని పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. అలాగే, వేంసూరు మండలం కుంచపర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ఆరెంపుల సుమశ్రీ, కావ్యశ్రీకి కూడా జట్టులో స్థానం లభించగా హెచ్‌ఎం షేక్ లాల్‌మహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

అకాల వర్షంతో మిర్చి, పత్తి పంటలకు నష్టం



ఎదుళ్లచెరువులో నేలవాలిన మిర్చి మొక్కలను సరిచేస్తున్న కూలీలు

తిరుమలాయపాలెం: గతనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో రైతులు నష్టపోగా.. మళ్లీ బుధవారం సాయంత్రం గాలిదుమారం, వర్షంతో నష్టం ఎదురైంది. మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గాలిదుమారంతో పెద్ద వృక్షాలు సైతం నేలకూలాయి. గాలిదుమారంతో పడిపోయిన మిర్చి మొక్కలను సరిచేయడంలో గురువారం రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. పత్తి పైర్లు కూడా నేలవాలగా, అల్ప పీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందనే సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.